


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 103 -

## కువైటు కనకమ్మ

**అక్షరం ముక్క** రాకపోయినా లక్షల్లో బిజినెస్ చేసి కోట్లు సంపాదించింది కనకమ్మ. కువైట్ దేశంలోని మాలియా సెంటర్ లో కనకమ్మ పేరు తెలియని తెలుగువారు ఎవరూ వుండరు. అక్కడ ఆమె చెయ్యని బిజినెస్సూ లేదు. కువైట్ సేట్లనే తెలివిగా బుట్టలో వేసుకుని దినార్లను కొల్లగొట్టి కోట్లు గడించింది. అయినా చివరికి ఏమీ మిగల్లేదు. ఎవరైనా అంతే.. నెత్తిన పెట్టుకుని పోలేరు కదా. అవసాన దశలో దురదృష్టం తలుపు తట్టి అనారోగ్యం పాలయ్యేంతవరకూ ఆమె పట్టుకున్నదంతా బంగారమయ్యింది.

కువైట్ లో అష్టైశ్వర్యాలతో రాణి భోగం అనుభవించింది. కాసులెన్ని సంపాదించినా ఎంత కూడగట్టుకున్నా మనిషి విధి చేతిలో కీలుబొమ్మే. చివరికి "ఎందరి కడుపులు కొట్టిందో, ఎన్ని పాపాలు చేసిందో కనకమ్మ అందుకే కుక్కలా దిక్కులేని చావు చచ్చింది" అనుకున్నారు జనాలు.

అది నిజమే. డబ్బు కోసం కనకమ్మ చెయ్యని పని లేదు. అది మంచో చెడో ఆమెకు అనవసరం. డబ్బే ప్రధానం.

దాదాపూ నలభయ్యేళ్ళు కువైట్ దేశంలో కనకమ్మ హవా నడిచింది. జనాల అవసరాలను, అసహాయ స్థితిని బాగా క్యాష్ చేసుకునేది. ఆమె చుట్టూ జనాలుండే వారు. ఆమెకు సపర్యలు చెయ్యడానికి పదిమంది కద్దామాలు వుండేవారు. కువైట్ సేట్లకు కూడా లేని విలాస జీవితాన్ని కనకమ్మ గడిపింది.

డబ్బు కోసం ఎందరినో మోసం చేసి, ముంచేసి, వేధించి, హింసించి, అనుకున్నది సాధించింది. దాని పర్యవసానమే ఆమెకు ఇలాంటి చావు వచ్చింది అనుకుంటారు మాలియాలోని తెలుగు వాళ్ళు. మాఫియారాణిలా మాలియాలోని సగం అంగళ్ళను తన గుప్పిట్లో వుంచుకుని కొంతకాలం అక్కడి వ్యాపారాన్ని ఆమె శాసించింది. కొందరి గుండెల్లో గుబులును పుట్టించింది.

ఓనమాలు రాని ఒక ఆడదానికి ఇంత తెలివా, ఇంత సామర్థ్యమా..? ఇదెలా సాధ్యం అని అక్కడి తెలుగు

వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. మాలియా ప్రాంతంలో లేడీ రౌడీగా, కేడీ కనకమ్మగా పేరుపొందిన కనకమ్మ అప్పులిచ్చి చక్రవడ్డీలతో జనాలను దోచేసింది. చిట్టీలు వేసి ఎగ్గొట్టి కోట్ల రూపాయలు ఎగనామం పెట్టింది. ఏమని అడిగితే రౌడీలతో కొట్టించేది. వీసాల వ్యాపారం చేసి ముక్కుపిండి లక్షలకు లక్షలు వసూలు చేసేది. దొంగ సారా కాయించి దొంగతనంగా అమ్మి దినారాలు గంపలకు ఎత్తేది.అమ్మాయిలతో వ్యభిచారం చేయించి దందాలు నిర్వహించేది. కువైట్ సేట్లకు, అధికారులకు అమ్మాయిలను తార్చి వారిని చేతిలో పెట్టుకునేది. ఇలాంటి పనులెన్ని చేసేదో లెక్కే లేదు. ఇలాంటివాళ్ళే కువైట్ వచ్చి ఈ దేశాన్ని, సేట్లను పాడు చేసారు. కనకమ్మ తెలివితేటలు అమోఘం. ఆమె శక్తిసామర్థ్యాలు అపారం. అలాంటి కనకమ్మ చివరికి హీనంగా, దీనంగా కుక్క చావు చచ్చింది.

❦❦❦

"మరి అన్యాయంగా అక్రమంగా జనాలను పీడించి పచ్చి రక్తాన్ని తాగింది కదా.. అది అలా చావాల్సిందే." తేల్చేసింది రజని. కనకమ్మ కొట్టిన దెబ్బలు గుర్తొచ్చి బుగ్గలు తడుముకుంటూ..

"దేవుడున్నాడు. అది చేసిన పాపాలకు శిక్ష ఇక్కడే అనుభవించింది. నాకు చాలా సంతోషంగా వుంది" చెప్పింది పుష్ప నవ్వుతూ. పుష్ప కూడా కనకమ్మ వద్ద వీసా కొని చాలా నష్టపోయింది.

"దాని శవం కూడా ఇండియాకు పోలేదు. ఇక్కడే ఎడారిలో పూడ్చిపెట్టారంట. ఇలాంటి ఆడవాళ్ళు మన భారత దేశానికి, భూమికి భారమే. అది చేసిన పాడు పనులకు, ఘోరాలకు మన దేశం సిగ్గుపడుతుంది. అది చేసిన ద్రోహానికి దాన్ని ఏదో ఒకరోజు నేనే చంపేసేదాన్ని" అంది లత ఆవేశంగా.

"దానికి తగిన శాస్తి జరిగింది. దాని పాపాలకు నరకాన్ని ఇక్కడే అనుభవించింది. ఆఖర్లో హాస్పిటల్లో దాని ముఖం చూడాలి. చావు భయంతో అది ఏడ్చేసరికి నాకు నవ్వొచ్చింది. నన్ను ఎన్ని హింసలు పెట్టిందో ఆ మాయలేడి. కాళ్ళు పట్టుకున్నా కనికరం చూపని ఆడది అది" చెప్పింది బాధగా లావణ్య.

కనకమ్మ తమ పట్ల వ్యవహరించిన కఠినమైన తీరును గుర్తు చేసుకుంటూ అక్కడ వున్న ఆడవాళ్ళు తలో విధంగా మాట్లాడుకుంటున్నారు. తమను ఎలా వేధించిందో గుర్తు చేసుకుని తిడుతున్నారు. అయ్యో పాపం అన్నవాళ్ళు, కన్నీళ్ళు విడిచిన వాళ్ళూ తక్కువే. చనిపోయినందుకు సంతోషించిన వాళ్ళే ఎక్కువ. కనకమ్మ చావును కువైట్ లో తెలుగు వాళ్ళు దాదాపూ నెలరోజులు కథలుగా చెప్పుకున్నారు.

❦❦❦

ఈ మధ్యనే కొత్తగా కువైట్ కు వచ్చిన అమ్మాయి శాంతి వారి మాటలన్నీ విని "ఇంతకీ ఈ కనకమ్మది ఇండియాలో ఏ ఊరు? పెళ్ళయిందా..? పిల్లలున్నారా..? ఆమె ఎలా చనిపోయింది" అని ఆసక్తిగా ప్రశ్నించింది.

లత నవ్వింది.

"చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా అని ఊరికే అనలేదు. ఈ కనకమ్మ కడప జిల్లా నుండి వచ్చింది. పదహారేళ్ళకు పెళ్ళయిందట. ఏమయిందో తెలియదు నాలుగేళ్ళు గడిచాక భర్త చనిపోయాడు. నిజం దేవుడికి ఎరుక. ఇది ఆడది కాదు రాక్షసి కదా.. భర్తను ఇదే చంపేసింది అంటారు. అదే కారణంతో అత్తగారు ఇంట్లోంచి వెళ్ళగొట్టారు. దీని అదృష్టమో, దురదృష్టమో వీసా తెప్పించుకుని కువైట్ కు వచ్చేసింది. ఇక్కడ దాదాపూ నలభయ్యేళ్ళు మాలియాలోని మగవాళ్ళు భయపడేటట్లుగా చక్రాన్ని తిప్పింది. గల్ఫ్ లోని ఇల్లీగల్ వ్యాపారాల్లో లోతుకు పాతుకుపోయి అందరినీ గడగడలాడించింది. పిశాచిలా డబ్బుకోసం ఎందరి బతుకులనో కాలరాసింది. ఇంకా తెలియని రహస్యాలు వెలుగుచూడని నేరాలు చాలా వున్నాయి అంటారు జనాలు."

"ఇక్కడి సంపాదన అంతా ఎప్పటికప్పుడు తోడబుట్టిన వాళ్ళకు పంపించేది. దేవుడు మనుషుల దురాగతాలను ఎల్లకాలం మౌనంగా చూస్తూ వుండడు కదా.. కనకమ్మకి షుగర్ వ్యాధి వచ్చింది. అప్పట్నుంచీ దాని పతనం మొదలయ్యింది. దాదాపు సంవత్సరం గడిచాక కాలి బొటన వేలుకు దెబ్బ తగిలి పుండు అయింది. డాక్టర్లు వేలు తీసేసారు. తరువాత ఆ పుండు పాదానికి వ్యాపించింది. పాదాన్ని కూడా తీసేసారు. అంతవరకూ తనకు తిరుగులేదు, ఎక్కడా ఎదురులేదు అని విర్రవీగిన కనకమ్మ అప్పుడు భయపడింది.

అది ఎప్పుడయితే బలహీన పడిందో అప్పుడు దాని శత్రువులు బలాన్ని కూడగట్టుకుని అన్నివైపుల నుండీ దాడి చేసారు. వ్యాపారాల మీద అవినీతి కార్యక్రమాలపైనా పోలీసు కేసులయ్యాయి. ఒక్కసారిగా అనారోగ్యం పాలయి, వ్యాపారం దెబ్బ కొట్టడంతో కోలుకోవడం కష్టమనిపించి ఇక మూటా ముల్లె సర్దుకుని ఇండియాకు పారిపోదామని ప్లాన్ వేసింది. అక్కడ కడపలోని బంధువులు కనకమ్మ పంపిన డబ్బంతా పోగు చేసుకుని వారి పేరుతో ఆస్తులు కూడగట్టుకున్నారు. ఈవిడ ఇంటికి వస్తోందని తెలిసి అందరూ మొహం చాటేసారు. ఫోన్ చేస్తే ఎత్తడం మానేసారు. బాధ్యత తీసుకోవడానికి ఎవరూ ఇష్టపడలేదు. అక్కడ అయినవారితో మోసపోయానని అర్థమయింది కనకమ్మకు. ఇలా జరుగుతుందని ఊహించలేదేమో ఈ లోపల షుగర్ ఎక్కువై కాలంతా పాకింది.

కువైట్ హాస్పిటల్ నుండి కదలడానికి లేకపోయింది. రాణిలా బతికిన కనకమ్మను ఇప్పుడు అందరూ ధైర్యంగా మొహం మీదే ఛీ కొట్టడం మొదలు పెట్టారు. కొందరు ఆమెచే బాధింపబడిన వారు చక్రాల కుర్చీలో తిరిగే కనకమ్మను, ఆమె కాలును చూసి నవ్వడం మొదలు పెట్టారు. బాగా కుమిలిపోయింది. రెండేళ్ళు కువైట్ హాస్పిటల్లోనే వుండిపోయింది."

"ఇటు ఆమెపై కేసులు నడుస్తున్నాయి. పోలీసులు ఆమె కున్న వ్యాపారాలు, అంగళ్ళు, నగలు, డబ్బు సీజ్ చేసారు. ఆమె పాస్పోర్ట్ తీసుకుని దానిపై ఎర్ర ముద్ర వేసారు. చేతులకు బేడీలు వేసి ఇండియాకు పంపించెయ్యాలి అని

నిర్ణయించుకున్నారు. తెలివితో నిర్మించుకున్న సామ్రాజ్యం ఒక్కసారిగా కూలిపోవడం, అనారోగ్యం పట్టి వేధించడం, అయినవారు మోసం చేయడం లాంటివన్నీ కనకమ్మ జీర్ణించుకోలేక పోయింది. కొందరు తెలిసిన వాళ్ళు చూడటానికి హాస్పిటల్ కు వచ్చి ఆమె చేసిన పాపాలే ఇలా శాపంగా మారాయి అని ముఖం మీదే చెప్పేవారు. ఇంతలో ఇన్ ఫెక్షన్ రెండో కాలికి పాకిందని ఆ కాలునూ ఆపరేషన్ చేసి తొలగించారు.

ఇక ఆ పరిస్థితి పగవారికి కూడా వద్దు. ఆమె ముఖంలో చావు కళ తొంగి చూసింది. దాని చేతిలో బాధలు పడ్డ వాళ్ళంతా దీనికి బాగయ్యింది అనుకుంటూ నవ్వుకున్నారు. ఇక బ్రతకడం అనవసరం అనుకుంది కనకమ్మ. డాక్టరు నెలరోజుల కోసం ఇచ్చిన మాత్రలన్నీ ఒకేసారి మింగేసింది. నాల్రోజులు స్పృహ కోల్పోయి నరక యాతన పడి ఐదోరోజు ప్రాణం వదిలేసింది. ఆమె శవాన్ని ఇండియాకు తీసుకెళ్ళడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఎవరూ అయ్యో అనలేదు. అనాథలా కువైట్ మార్చురీలో అలాగే పడి వుంటే తరువాత హాస్పిటల్ వాళ్ళే తీసుకెళ్ళి ఎడారిలో గుంత తీసి శవాన్ని అందులో పడేసారు."

"అది ఎంత సంపాదిస్తే ఏం లాభం? చివరికి కుక్క చావు చచ్చింది. శవం కూడా ఇండియాలోని స్వస్థలానికి పోలేదు. పాపిష్టిది మన భూమికి భారమయింది. కనకమ్మ చరిత్ర అలా ముగిసింది. అందుకే మనిషి విచ్చలవిడిగా పాపాలు చెయ్యకూడదు. విర్రవీగకూడదు. అదే కనకమ్మ మంచిదయితే, మంచి పనులు చేసి వుంటే చచ్చాక మనుషులు మంచిగా చెప్పుకునే వాళ్ళు. నాలుగు కన్నీటి చుక్కలు రాల్చే వాళ్ళు.

ఎవరయినా సరే చివరికి సాధించేది ఏముంది. చచ్చాక మనతో పాటూ ఏం మూట కట్టుకుని పోగలం? మనుషులు ఈ సత్యాన్ని తెలుసుకోవాలి." అంటూ కనకమ్మ కథని చెప్పి నిట్టూర్చింది లత.

నిజమే అంటూ తలూపింది శాంతి.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments